

రంజాన్ వేళలు

శనివారం	ఇఫ్తార్
సాయంత్రం	గం 6 : 24
ఆదివారం	సహోరి
ఉదయం	గం 5 : 02

న్యూస్‌రీల్

నేడు మార్కాపురంలో సీఎం చంద్రబాబు పర్యటన



సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ తదితరులు

మార్కాపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం ఉదయం 10.45 గంటలకు హెలికాప్టర్‌లో మార్కాపురం రానున్నారు. గం.10.55 వరకూ ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తారు. గం.11.15 వరకు అధికారులతో సమావేశమై సభా వేదికకు చేరుకుంటారు. అనంతరం స్టాల్స్‌ను సందర్శించి రుణాల పంపిణీ, మహిళలతో ముఖాముఖితోపాటు మహిళలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో సమావేశమై, జిల్లా అధికారులతో సమీక్ష చేస్తారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి భద్రతా ఏర్పాట్లు, సభా వేదిక ఏర్పాట్లను కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, సబ్‌కలెక్టర్ త్రివినాగ్, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ ద్వారా సీఎం పర్యటించే ప్రాంతాల్లో పటిష్ట భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. హెలీప్యాడ్ ప్రాంతాన్ని, సీఎం కాన్వాయ్ రూటును పరిశీలించారు. ట్రయల్‌రన్ నిర్వహించారు. ఈయన వెంట అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, ఎస్ఎస్‌జీ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, ఎస్ఎస్‌జీ డీఎస్పీ పోతురాజు, డీఎస్పీలు నాగరాజు, శ్రీనివాసరావు, సాయి ఈశ్వర్ యశ్వంత్, సీఐలు రాఘవేంద్ర, సుబ్బారావు పాల్గొన్నారు.


ఇంటర్ పరీక్షలకు 818 మంది గైర్హాజరు

ఒంగోలు సిటీ: ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం పరీక్షలు మూడో రోజు మాథ్స్ 2ఏ, బోటనీ 2, సివిక్స్ 2 పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలకు 19,614 మందికి గాను 18796 మంది విద్యార్థులు హాజరయ్యారు. 818 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ 17666 మంది విద్యార్థులు గాను 17013 మంది హాజరవగా, 653 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షకుగాను 1948 మందికి గాను 1783 మంది హాజరవగా, 165 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలు నిర్వహించడానికి జిల్లాలో 67 సెంటర్లు కేటాయించారు. ఆర్ఐఓలు ఏడుగురు, 17 మంది డీఈసీ- డీఐఈఓలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. 32 మంది స్క్వాడ్స్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మాల్ ప్రాక్టీస్ చేసిన ఒకరిని బుక్ చేశారు.

నేడు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

కొమరోలు: మండలంలోని ఇడమకల్లు గ్రామంలో కళ్యాణరామ, పట్టాభిరామస్వామి ఆలయ జీర్ణోద్ధరణ ధ్వజ, శిఖర, కలశ విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా శనివారం రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. బండలాగుడు పోటీల్లో 7 నగదు బహుమతులు వరుసగా రూ.1 లక్ష, రూ.80 వేలు, రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు అందజేస్తున్నామన్నారు. ఉదయం 10 గంటలకు పోటీలు నిర్వహిస్తారని, ఆసక్తి గల వారు 9573319779 సంప్రదించాలని తెలిపారు.

తల్లికి వందనం..ఉచిత బస్సు ప్రయాణం..మహిళలకు నెలకు రూ.1500 ఇలా సూపర్ సిక్స్‌లో మహిళల కోసం చెప్పిన ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా దగాచేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒకవైపు మహిళలను మోసం చేస్తూనే మరోవైపు ఇంకా వారిని భ్రమల్లో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నేడు మార్కాపురంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వస్తున్నారు. చంద్రబాబు పర్యటనను జిల్లాలోని మహిళా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఒట్టిమాటలు చెప్పడం మానేసి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.



ఒట్టిమాటలు.. వెన్నుపోట్లు

నారావారి చేతిలో మోసపోయిన నారి

- హామీలు అమలు చేయకుండా మహిళలను వంచించిన చంద్రబాబు
- తొలి ఏడాది తల్లికి వందనానికి ఎగనామం
- మహిళలకు ఉచిత బస్సుపైనా కాలయాపన
- 18 ఏళ్లు పైబడిన మహిళలకు నెలకు రూ.1500 ఊసే లేదు
- 45 ఏళ్లు నిండిన మహిళలకు రూ.20 వేలు ఇస్తామన్న హామీకి మంగళం
- ఏడాదికి మూడు సిలిండర్లంటూ తొలి ఏడాది ఒక్క సిలిండర్‌తో సరి
- విచ్చలవిడి మద్యం వ్యాపారంతో మహిళలపై పెరిగిన వేధింపులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు/ఒంగోలు టౌన్:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో మహిళా సంక్షేమం తీసుకొస్తామంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఊరువాడా హోరెత్తించారు. మాయమాటలు చెప్పి ఓట్లేయించుకున్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత తల్లికి వందనానికి ఎగనామం పెట్టారు. ఉచిత బస్సు ఊసే మరిచారు. మూడు సిలిండర్లకు కోతలు పెట్టారు. చేసిన హామీలన్నిటినీ అటకెక్కించారు. కాపురాలు కూల్చి మహిళల కాపురాల్లో చిచ్చుపెట్టే మద్యం వ్యాపారాన్ని మొదలుపెట్టారు. ఊరూరికి మద్యం సరఫరా చేస్తూ మహిళలపై హింసను రాజేస్తూ నాయకుల సంపద పెంచే పనిలో పడ్డారు.

తల్లికి వందనానికి తొలి ఏడాదే ఎగనామం:

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అమ్మ ఒడి పేరుతో ఏడాదికి రూ.15 వేల చొప్పున అందించారు. 2019 నుంచి క్రమం తప్పకుండా అమ్మ ఒడి పథకాన్ని అమలు చేశారు. జిల్లాలో మొత్తం రూ.1358 కోట్లను తల్లుల ఖాతాలో జమచేశారు. కానీ ఇందుకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వం తొలి ఏడాదే తల్లికి వందనం పథకానికి ఎగనామం పెట్టింది. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున అందిస్తామని చెప్పిన చంద్రబాబు అండ్ కో ఇచ్చిన మాట తప్పి తొలి ఏడాదే తల్లులను మోసం చేసిందని మహిళలు మండిపడుతున్నారు. జిల్లాలో 1 నుంచి 6వ తరగతి వరకు 96,258 మంది విద్యార్థులుండగా, 6 నుంచి 9వ తరగతి వరకు 94,362 మంది ఉన్నారు. ఇక 29,603 మంది పదో తరగతి, 43,441 మంది ఇంటర్మీడియెట్ చదువుతున్నారు. మొత్తం మీద 2,63,664 మంది విద్యార్థులకు గాను ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున రూ.395 కోట్ల 49 లక్షల 60 వేలను కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టిందని మహిళా సంఘాలు మండిపడుతున్నాయి. ఈ ఏడాది పథకాన్ని అమలు చేస్తానని చెబుతున్నా బడ్జెట్లో అరకొర నిధులను కేటాయించడంతో ఎన్ని కోతలు పెడతారోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

షరతులతో ఉచిత బస్సు...

రాష్ట్రంలోని మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం అధ్యయనం పేరిట కాలయాపన చేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2025-26 బడ్జెట్లో కూడా దీనికి ఎలాంటి నిధులు కేటాయించలేదు. ఇప్పుడు ఉచిత బస్సు ప్రయాణానికి పరిమితులు విధిస్తూ కేవలం జిల్లాలోపు మాత్రమే ఉచిత ప్రయాణానికి అనుమతిస్తారని చెబుతున్నారు. ఈ పరిమితులపై మహిళలు మండిపడుతున్నారు. జిల్లాలో 13 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణంపై ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఏడాదికి ఒక్క గ్యాస్ సిలిండరే...

ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామంటూ కూటమి నాయకులు హామీ ఇచ్చారు. గత ఏడాది దీపావళి రోజు దీపం 2.0 పథకాన్ని ప్రారంభించారు. అయితే గత ఏడాది కేవలం ఒక్క గ్యాస్ సిలిండర్ మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అది కూడా నామమాత్రంగా అమలు చేస్తుండడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 49 గ్యాస్ ఏజెన్సీల ద్వారా వంటగ్యాస్ సరఫరా చేస్తారు. జిల్లాలో 3,26,865 ఐఓసీ కనెక్షన్లు ఉన్నాయి. 1,57,202 హెచ్‌పీ కనెక్షన్లు, 2,16,323 బీపీసీ కనెక్షన్లు ఉన్నాయి. మొత్తం 7.39 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. దీపం 2.0 పథకం ప్రారంభోత్సవం సమయంలో జిల్లాలో 4,80,711 మంది లబ్ధిదారులు ఉన్నట్లు అధికారులు చెప్పడం గమనార్హం. దీనిని బట్టి చూస్తే మిగతా 2.60 లక్షల మందికి ఉచిత గ్యాస్ లేనట్టేనని చెప్పవచ్చు. ప్రభుత్వం కేటాయించిన నిధుల ప్రకారం చూస్తే సగానికి సగం మందికి కూడా ఉచిత గ్యాస్‌కు సంబంధించిన నగదు జమ కావట్లేదు.

నెలకు రూ.1500 పథకం ఊసే లేదు:

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 55 ఏళ్లు దాటిన మహిళలకు ఏడాదికి రూ.18 వేలు ఇచ్చారు. అదే పథకానికి రంగుపూసిన చంద్రబాబు 19 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ పథకం గురించి ఇప్పుడు అస్సలు మాట్లాడడం లేదు. జిల్లాలో 7.80 లక్షల మంది 19 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన మహిళలున్నారు. 5.2 లక్షల మంది 45 పైబడిన వయసు కలిగిన మహిళలున్నారు. వీరంతా నెలకు రూ.1500 వస్తాయి కదా అనుకొని ఆశ పడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడంతో మండిపడుతున్నారు.

మద్యంతో మహిళలపై పెరిగిన హింస...

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు సంక్షేమాన్ని విస్మరించి టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకులకు సంపద సృష్టించి ఇవ్వాలన్న తపనతో మద్యం వ్యాపారాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. జిల్లాలో 171 మద్యం దుకాణాలను కేటాయించగా, 2500కు పైగా బెల్టు దుకాణాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారు. జిల్లాలో గుక్కెడు మంచినీళ్లు దొరకడం లేదు కానీ కావలసినంత మద్యం మాత్రం దొరకుతోంది. దీంతో గ్రామాల్లో మందుబాబుల సంఖ్య బాగా పెరిగింది. తప్పతాగి ఇంటికెళ్లి భార్యాబిడ్డలను వేధిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మద్యం ప్రభావం ఎక్కువగా మహిళలపై ఉందని, ఇటీవల మహిళలపై హింస బాగా పెరిగిపోయిందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

వెలుగొండపై ఇంతటి నిర్లక్ష్యమా

మార్కాపురం: ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల్లో శాశ్వతంగా కరువు నివారించే పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణపనులపై నీలి నీడలి కమ్ముకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బడ్జెట్‌లో కేవలం రూ.309.13 కోట్లు కేటాయించడంతో సిబ్బంది జీతభత్యాలకు మాత్రమే సరిపోతుందని ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తుతున్నారు.

ప్రాజెక్టు నిర్మాణం ఇలా:

ప్రాజెక్టు వల్ల 4.47 లక్షల 300 ఎకరాలకు సాగు నీరు, 15.25 మంది లక్షల మందికి తాగు నీరు అందించేలా డిజైన్ చేశారు. దివంగత వైఎస్సార్ ప్రాజెక్టును ప్రారంభించగా 2014 నాటికి ప్రాజెక్టు కోసం రూ.1448.14 కోట్లు ఖర్చు పెట్టారు. గొట్టిపడియ, సుంకేసుల, కాకర్ల డ్యాంలు పూర్తయ్యాయి. 1వ టన్నెల్ 11.50 కిలో మీటర్లు పూర్తికాగా, 2వ టన్నెల్ 9 కిలోమీటర్లు పూర్తైంది. టన్నెల్ 1 పనులు 62 శాతం, టన్నెల్ 2 పనులు 48 శాతం పూర్తయ్యాయి.



వెలిగొండ ప్రాజెక్టు 1,2 టన్నెళ్ల వ్యూ

2014-18 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో వెలిగొండకు రూ.600 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలపై దృష్టి సారించలేదు. 1వ టన్నెల్‌కు సంబంధించి కేవలం 2 కిలోమీటర్లు మాత్రమే పనులు జరిగాయి.

2019- 24 మధ్య జరిగిన అభివృద్ధి ఇదీ..

2019-24 మధ్య వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రాజెక్టు పనులకు రూ.822.08 కోట్లు ఖర్చుపెట్టారు. ఇంకా భూసేకరణకు రూ.79.21 కోట్లు, పునరావాస కల్పనకు రూ.76.73 కోట్లు కేటాయించారు. దోర్నాల మండలం కొత్తూరు వద్ద రెండు టన్నెల్ పనులు పూర్తయ్యాయి. ఒక్కొక్క టన్నెల్ 18.8 కిలో మీటర్ల పొడవుతో నిర్మించారు. మొదటి టన్నెల్ పనులు పూర్తి చేయగా, రెండో టన్నెల్ పనులు కూడా వేగంగా చేపట్టారు. తీగలేరు, గొట్టిపడియ, తూర్పు ప్రధాన కాలువ, ఉపకాలువలు, ఉదయగిరి ఉపకాలువ, పడమర ఉప కాలువ, టి-5 కాలువల పనులు పూర్తయ్యాయి. 3 గ్యాప్‌ల నిర్మాణం వల్ల 11 గ్రామాలు మునిగి పోనున్నాయి. ఇందులో మొత్తం 7270 కుటుంబాలు ఉన్నాయి. వీరిలో కొంతమందికి వన్‌టైమ్ సెటిల్‌మెంటు, మరికొంత మందికి ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాల్సి ఉండగా, ఈ బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో పునరావాస కాలనీలకు శ్రీకారం చుట్టారు. సిమెంటు రోడ్లు, వాటర్ట్యాంకులు, పాఠశాలలను నిర్మించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వీటిని పట్టించుకోకపోవడంతో చిల్లచెట్లతో నిండి పోయాయి.

ఇలా అయితే వెలుగొండ ఎప్పటికి పూర్తవుతుంది ?



ఇటీవల బడ్జెట్‌లో వెలుగొండ ప్రాజెక్టుకు రూ.309.13 కోట్లు మాత్రమే కేటాయించారు. వీటితో వెలుగొండ ప్రాజెక్టు పనులు పూర్తిచేసి, నిర్వాసితులకు న్యాయం చేసి నీళ్లెప్పుడు ఇస్తారో అర్థం కావడం లేదు. చంద్రబాబునాయుడు వెలుగొండకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి త్వరితగతిన ప్రాజెక్టును పూర్తిచేయాలి. పునరావాస కాలనీలు నిర్మించి నిర్వాసితులకు న్యాయం చేయాలి.

– జంకె వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఏపీఐఐసీ మాజీ చైర్మన్

పునరావాస పనులకు నిధులెక్కడ



ఇటీవల బడ్జెట్‌లో ప్రకటించిన వెలుగొండ ప్రాజెక్టు నిధుల్లో పునరావాస కాలనీలకు ఎంత నిధులు కేటాయిస్తారో చెప్పలేదు. మార్కాపురం మండలం కుంట వద్ద గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన పునరావాస కాలనీలో పిచ్చిచెట్లు పడ్డాయి. ప్రభుత్వం వెంటనే ప్రత్యేకంగా నిధులు కేటాయించి పునరావాస కాలనీలు పూర్తిచేయాలి.

– నల్లబోతుల కొండయ్య, గొట్టిపడియ

మహిళల నమ్మకాన్ని పోగొట్టుకున్నారు



మహిళల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తామని చెప్పి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చారు. ఇప్పటికి 9 నెలలు అవుతున్నాయి. కనీసం ఒక్కటంటే ఒక్క పథకం కూడా సంపూర్తిగా అమలు చేయడం లేదు. తల్లికి వందనం ఎగవేశారు. ఉచిత బస్సును అడ్రస్ లేకుండా చేశారు. నెలకు రూ.1500 ఒక భ్రమగా మిగిలింది. మహిళలను అన్నీ రకాలుగా మోసం చేసిన చంద్రబాబు ఇప్పుడు మళ్లీ దగా చేసేందుకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని అడ్డుపెట్టుకుంటున్నారు. ఆయన మహిళల నమ్మకాన్ని పోగొట్టుకున్నారు. ఎన్ని వేషాలు వేసినా నమ్మే పరిస్థితి లేదు.

– కంకణాల రమాదేవి, ఐద్వా జిల్లా కార్యదర్శి

మహిళలను ఎల్లకాలం మోసం చేయలేరు



ఒకసారి చంద్రబాబు మాటలు నమ్మి మోసపోయిన మహిళలు మరోసారి నమ్మడానికి సిద్ధంగా లేరు. గత ఎన్నికల్లో సూపర్ సిక్స్ అన్నారు. అదెక్కడికి పోయిందో అర్థం కావడం లేదు. రాష్ట్రంలో కోటి 54 లక్షల కుటుంబాలకు ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలంటే ఏడాదికి రూ.4 వేల కోట్లు అవసరమవుతాయి. కానీ కేవలం రూ.895 కోట్లు మాత్రమే కేటాయించడం చంద్రబాబు దగాకోరుతనానికి నిదర్శనం. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసిన తరువాతనే చంద్రబాబు మహిళా దినోత్సవాలకు రావాలి.

– బి.పద్మ, పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి

మెడి'కలే'నా

మార్కాపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మార్కాపురంలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. కాలేజీ నిర్మాణ పనులు యధావిధిగా జరిగి ఉంటే ఈ ఏడాది ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ప్రవేశాలు ప్రారంభమై ఉండేవి. పశ్చిమ ప్రకాశంలోని సుమారు 8 లక్షల మంది ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్కాపురానికి సుమారు రూ.475 కోట్లతో మెడికల్ కళాశాల మంజూరు చేశారు. పనులు కూడా దాదాపు 75 శాతం పూర్తయ్యాయి. జిల్లా వైద్యశాలను జీజీహెచ్‌గా మార్చడంతోపాటు 450 బెడ్లు ఏర్పాటుచేసి, 82 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంటు ప్రొఫెసర్లు, డాక్టర్లు అందుబాటులో ఉంచారు. దీంతో రోజుకు సుమారు 750 నుంచి 800 మంది పేషంట్లు వైద్యసేవలు పొందేవారు. 3 ఆక్సిజన్ ప్లాంట్లు, ఐసీయూ యూనిట్, వెంటిలేటర్ సౌకర్యాలు కూడా కల్పించారు. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం అసంపూర్తి భవనాలంటూ నిలిపేయడంతో పాటు జీజీహెచ్‌లో ఉన్న సుమారు 40 మంది వైద్యులని రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసింది. దీంతో వైద్యసేవలు తగ్గిపోయాయి. పశ్చిమ ప్రకాశంలో సుమారు 72 చెంచుగూడేలు ఉన్నాయి. వీరందరికీ కార్పొరేట్ వైద్యం అందాలంటే మార్కాపురం వచ్చి అక్కడి నుంచి కర్నూలు, గుంటూరు వెళ్లాల్సి వస్తోంది. నూతనంగా వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని మెడికల్ కళాశాలను గుజరాత్ తరహాలో పీపీపీ (పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్) విధానంలో చేపట్టే ప్రతిపాదనలు చేయడం పట్ల సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రైవేటు వ్యక్తుల నియంత్రణలో వైద్యసేవలు అందుతాయి. దీనిపై జనం భగ్గుమంటున్నారు.



నిలిచిన మార్కాపురం మెడికల్ కళాశాల భవనం

మెడికల్ కళాశాల పూర్తిచేసి అడ్మిషన్లు ప్రారంభించాలి




అర్ధాంతరంగా నిలిపేసిన మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు పూర్తిచేసి అడ్మిషన్లు వెంటనే ప్రారంభించాలి. వెనుకబడిన ప్రాంత విద్యార్థులు ఎంబీబీఎస్ చదవాలంటే దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. మెడికల్ కళాశాల పూర్తిచేసి ప్రారంభిస్తే ఈప్రాంత విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుంది. మెడికల్ కళాశాల నిర్వహణ ప్రైవేటుపరం చేయకుండా ప్రభుత్వమే నిర్మించాలి.

– అందె నాసరయ్య, సీపీఐ ఏరియా కార్యదర్శి, మార్కాపురం

మార్కాపురం జిల్లా ఏర్పాటయ్యేనా..?

మార్కాపురం: కూటమి ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలు కావస్తున్నా మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించకపోవడంతో ఈ ప్రాంత ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. అధికారంలోకి రాగానే జిల్లా ఏర్పాటు చేస్తామని నాటి ఎన్నికల సభలో నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు, లోకేష్ హామీ ఇచ్చారు. మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, దర్శి, కనిగిరి ప్రాంతాలను కలుపుతూ జిల్లా ఏర్పాటు చేయడంతో పాటు కందుకూరు, అద్దంకి ప్రాంతాలను ఒంగోలులో కలుపుతామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా ఏర్పాటుపై ప్రకటన చేస్తారని ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్నారు. మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేసేందుకు అన్నీ అర్హతలు ఉన్నాయి. మార్కాపురంలోనే సబ్‌కలెక్టర్, డీఎస్పీతోపాటు గతంలో అదనపు ఎస్పీ స్థాయి అధికారిని ఓఎస్డీగా నియమించారు. మార్కాపురంలో జిల్లా ఆరో దనపు కోర్టు, ఆకాశవాణి కేంద్రం, ఎక్సైజ్ కార్యాలయాలతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జీఎస్టీ కార్యాలయాలు ఉన్నాయి. మార్కాపురం రైల్వేస్టేషన్ రోడ్, మెడికల్ కాలేజీ, జీజీహెచ్, వీటితో పాటు నాలుగు ఇంజినీరింగ్ కళాశాలలు, ఫార్మసీ, బీఈడీ, ఎంబీఏ, లా, అగ్రికల్చర్, హార్టీకల్చర్ కాలేజీ తదితర విద్యా సంస్థలు కూడా ఉన్నాయి. జిల్లా కేంద్రం ఏర్పాటైతే కేంద్ర ప్రభుత్వం నుంచి వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి వచ్చే నిధులు మార్కాపురానికి వస్తాయి. ప్రస్తుతం జిల్లా కేంద్రమైన ఒంగోలుకు వెళ్లాలంటే పుల్లలచెరువు నుంచి 170 కిలోమీటర్లు, గిద్దలూరు నుంచి 150 కిలోమీటర్లు, దోర్నాల నుంచి 130 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది.



మార్కాపురం పట్టణం వ్యూ

త్వరగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలి



పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల కోరిక అయిన మార్కాపురం జిల్లా ఏర్పాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు త్వరగా నిర్ణయం తీసుకోవాలి. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మార్కాపురం వచ్చినప్పుడు మార్కాపురం కేంద్రంగా జిల్లా కేంద్రం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

– పత్తి రవిచంద్ర, వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి

వైఎస్సార్ విగ్రహంపై దాడి తగదు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి

ఒంగోలు సిటీ: ఒంగోలు నగరంలోని మామిడిపాలెంలో రెడ్డి హాస్టల్ వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహంపై టీడీపీ కార్యకర్తలు దాడి చేయడం, అవమాన పరచడం మంచి పద్ధతి కాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి హెచ్చరించారు. ఒంగోలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ విగ్రహాన్ని అవమానపరిచిన వారిపై పోలీసులు తక్షణమే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఇలాంటి దుశ్చర్యలు పునరావృతం అయ్యే అవకాశం ఉందన్నారు. అన్నదమ్ముల మధ్య మనస్పర్థలు ఉంటే ఇంటి దగ్గర తేల్చుకోవాలని ఇలా రోడ్ల మీద పడి రచ్చ చేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఒంగోలు నగర ప్రజలు ఇలాంటి తప్పుడు సంస్కృతిని అంగీకరించరని చెప్పారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతినేలా ఎవరు ప్రయత్నించినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్ర ప్రజలందరి ప్రాణాలను కాపాడడానికి 108 అంబులెన్స్‌లు, నిరుపేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ, పేదరికం కారణంగా చదవులు ఆగిపోకుండా ఫీజురీయింబర్స్‌మెంట్ తీసుకొచ్చిన గొప్ప నాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని కొనియాడారు. ఈవీఎంలు, అసత్య ఆరోపణలతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందే తప్ప రాష్ట్రంలో ఇప్పటికీ టీడీపీ, జనసేన కంటే బలంగా ఉందని గుర్తు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల నుంచి పుట్టిన పార్టీ అని, ప్రజలే మా నాయకులు అని స్పష్టం చేశారు. ఇది ఎవరి నుంచో లాక్కున్న పార్టీ కాదని, ఒక నాయకుడి పోరాట పటిమతో పురుడు పోసుకున్న పార్టీ అని చెప్పారు. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని లక్షలాది ప్రజలకు సాగు, తాగునీరు అందించే వెలుగొండ ప్రాజెక్టు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలోనే 90 శాతం వరకు పూర్తయిందన్నారు. కేవలం ఆర్‌ఆర్ ప్యాకేజీలు ఇచ్చి చిన్న చిన్న పనులు చేస్తే మిగిలిన ప్రాజెక్టు పనులు పూర్తవుతాయని చెప్పారు. వెలుగొండ ప్రాజెక్టుకు అరకొర నిధులు కేటాయించడానికి వ్యతిరేకంగా యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పాదయాత్ర చేయనున్నట్లు అసెంబ్లీలోనే ప్రకటించారని, పాదయాత్రలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయన వెంట నడుస్తాయని చెప్పారు. రెడ్‌బుక్ రాజ్యాంగానికి ఇక్కడ ఎవరూ భయపడటం లేదన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టాలంటే ఎక్కువ రోజులు సాధ్యం కాదన్నారు. కూటమి నాయకులు ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా ఎంపీ అభ్యర్థికి ఆరున్నర లక్షలకు పైగా ఓట్లు వచ్చాయని తెలిపారు. ఎక్కడికి వెళ్లినా మా ఓట్లు ఏమైపోయాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. ఆయన వెంట ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు నటారు జనార్ధనరెడ్డి, పిగిలి శ్రీను, హౌసింగ్ చిన్న, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, పక్కన పార్టీ నాయకులు

సాహసంలో రుద్రాణి

● కరాటేలో అందలాలు ఎక్కిన అంధుని పుత్రిక
● బ్లాక్ బెల్ట్ సిక్స్ డాన్‌గా రాణిస్తున్న లక్ష్మీసామ్రాజ్యం


మెళకువలు నేర్పిస్తున్న కరాటే సిక్స్‌డాన్ లక్ష్మీ సామ్రాజ్యం

కొనకనమిట్ల: 'ముదితల్ నేర్వగరాని విద్య గలదే ముద్దార నేర్పించినన్'.. నిజమే స్త్రీలు తలుచుకుంటే ఏ విద్యనైనా ఇట్టే నేర్చుకోగలరు. నర్రా లక్ష్మీసామ్రాజ్యం తనకు ఇష్టమైన ఆత్మ రక్షణ విద్యను అలాగే నేర్చుకుంది. మాస్టర్ రవి శిక్షణలో కరాటేలో ప్రావీణ్యం సంపాదించి దేశ ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాప్తి చేశారు. కరాటే బ్లాక్ బెల్ట్ సిక్స్ డాన్ అయిన లక్ష్మీ సామ్రాజ్యం ఎంతో మంది బాలికలు, యువతులు, మహిళలకు ఓ రోల్ మోడల్. రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ నిర్వహిస్తూ మహిళలకు ధైర్యాన్ని, తెగువను నూరిపోస్తున్న ఆమె ఓ పేద కుటుంబం నుంచి వచ్చారు. కొనకనమిట్ల మండలం గరిమినపెంట పంచాయతీకి చెందిన అంధుడైన నర్రా వెంకటరత్నం, శారద సంతానం లక్ష్మీసామ్రాజ్యం. ఆరోగ్యంతో పాటు శారీరక ధారుఢ్యం, మానసిక వికాసం, మనో ధైర్యాన్నిచ్చే అద్భుతమైన శక్తి కరాటేకు ఉందని చిన్ననాడే గ్రహించింది. తల్లిదండ్రులు, గురువుల సహకారంతో గొట్లగట్టు ఉన్నత పాఠశాలలో 1985లోనే శిక్షణకు ఉపక్రమించింది. ఈ క్రమంలో మూడు పర్యాయాలు బ్లాక్ బెల్ట్ సిక్స్ డాన్(కాయ్)గా ఎంపికయ్యారు. కరాటేలో అంతర్జాతీయ అవార్డులు సొంతం చేసుకుని భారత కీర్తిని ఇనుమడింజేశారు. మహిళల రక్షణ ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితుల్లో రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీని స్థాపించారు. మాస్టర్ రవితో కలిసి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మహిళలకు ఆత్మ రక్షణ విద్యలో 15 అంశాల్లో మెళకువలు నేర్పుతున్నారు.

మహిళా పోలీసులకు శిక్షణ..

రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ద్వారా ఆంధ్ర, తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో మహిళా పోలీసులతో పాటు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు చేయూతనిస్తే గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఆత్మరక్షణలో శిక్షణ ఇస్తానని చెబుతున్నారు. గతంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 385 ప్రభుత్వ పాఠశాలల్లో అప్పటి ఎడ్యుకేషన్ కమిషనర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం అనంతపురంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అవార్డులు – రివార్డులు

నార్త్ అమెరికాలో లాస్ ఇకాస్‌లో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో ఓపెన్ విభాగంలో 17 రాష్ట్రాలతో పోటీపడి గోల్డ్ మెడల్ సాధించారు. 2001లో మలేషియాకు చెందిన గ్రాండ్‌మాస్టర్ రిక్నీవాంగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్ పోటీల్లో బ్లాక్ బెల్ట్‌ను సొంతం చేసుకున్నారు. 2003లో శ్రీలంకలోని మాతలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో, ముంబై, విజయవాడలో నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లో స్వర్ణాలు సాధించారు. తన తండ్రి పుట్టు అంధుడైన వెంకటరత్నం కోరిక మేరకు లార్డ్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి దివ్యాంగులకు సేవలందిస్తున్నారు.


అమెరికాలో గోల్డ్ మెడల్ అందుకుంటూ

నేడు మహిళా దినోత్సవం



అలుపెరగని ప్రయత్నం ఆమెది.. బాధ నిండిన బాధ్యత ఆమెది.. శ్రమిస్తుంది ఆమె.. ఆశనే ఊపిరిగా మార్చి పరితపిస్తుంది. బహుముఖ ప్రజ్ఞాశాలిగా బాధ్యతలెన్నో చేపడుతుంది. సహనంలో.. సమరంలో.. సమసమాజ నిర్మాణంలో పునాది ఆమె. ఆంక్షల సంకెళ్లను తెంపుకొని, అవమానాలను దాటుకొని, హద్దు లేని స్థైర్యంతో అలుపెరగని యోధురాలిలా అడుగులు వేస్తుంది. కంటికి రెప్పలా కాపాడితే ఆమె కల్పతరువు. వెన్నుతట్టి ప్రోత్సహిస్తే బుద్ధిలో బృహస్పతి. ప్రగతి బాటన నడుస్తూ తెగువ చూపుతున్న మగువలందరికీ 'సాక్షి' సలాం.. మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళల ప్రస్థానంపై ప్రత్యేక కథనం..

విద్యలో వాణి


తల్లిదండ్రులతో అనుపమ, లక్ష్మీప్రియ

సంతనూతలపాడు: దృఢ సంకల్పం ఉంటే.. కొండంత లక్ష్యమైనా ఛేదించడం సులువే! వైఫల్యాలు వెక్కిరించినా, విజయమే లక్ష్యంగా ముందుకు సాగారు ఈ అక్కాచెల్లెళ్లు. లక్షల మందితో పోటీపడి పోటీ పరీక్షల్లో నెగ్గి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. తల్లి ప్రోత్సాహంతో విజయం దిశగా వడివడిగా అడుగులు వేసిన వీరి ప్రస్థానం యువతకు ఆదర్శనీయం. మహిళా దినోత్సవం సందర్భంగా తమ విజయాన్ని తల్లికి అంకితమిచ్చారు. సంతనూతలపాడుకు చెందిన గోనేపల్లి కోటేశ్వరరావు, సుజాత దంపతుల కుమార్తెలు అనుపమ, లక్ష్మీప్రియ. ఇద్దరూ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సంతనూతలపాడులో గోదాటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీనివాస కాన్వెంట్లో చదివారు. ఆరు నుంచి పదో తరగతి వరకు జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యనభ్యసించారు. అక్కాచెల్లెళ్లిద్దరూ పదో తరగతి నుంచి ఎంటెక్ వరకు ప్రథమస్థానాల్లో మార్కులు సాధించారు. ఇంజినీరింగ్ పూర్తయిన వెంటనే హెచ్‌సీఎల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌గా అవకాశం వచ్చినా వదిలేశారు. ప్రభుత్వ ఉద్యోగాలే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో అనుపమ వీఆర్‌ఓ, పంచాయతీ సెక్రటరీగా ఒకే పర్యాయంలో ఉద్యోగాలు సాధించింది. చీమకుర్తిలో వీఆర్‌ఓగా భాధ్యతలు నిర్వహించి, అందరి మన్ననలూ పొందింది. ఉద్యోగం చేస్తూనే పోటీ పరీక్షల్లో నెగ్గి కేంద్ర హోంశాఖలో ఉన్నత ఉద్యోగం సాధించింది. నంద్యాలలోని కోచింగ్ సెంటర్లో శిక్షణ పొందిన లక్ష్మీప్రియ తన సోదరికి ఉద్యోగం వచ్చిన మరుసటి నెలలోనే ఆంధ్రా బ్యాంక్ పీఓగా ఎంపికైంది. నెల వ్యవధిలోనే కుమార్తెలిద్దరూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాదించడంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు.

అమ్మే నా మొదటి గురువు

చిన్ననాటి నుంచి అమ్మ ప్రభావం నాపై ఎక్కువగా ఉంది. నాన్న ఫొటోగ్రఫీతో బిజీగా ఉండేవారు. క్రమం తప్పకుండా అమ్మ మా ఆలనాపాలనా చూస్తూ క్రమశిక్షణ, విద్యాబుద్ధులు నేర్పించింది. అమ్మ ప్రోత్సాహం, నాన్న కృషి వల్లే పట్టుదలతో చదివి హోంశాఖలో ఉన్నత ఉద్యోగం సాధించగలిగా. – అనుపమ

ఈ విజయం అమ్మదే..

చిన్నప్పటి నుంచి అమ్మే దగ్గరుండి చదివించేది. క్రమం తప్పకుండా బడికి వెళ్లేవాళ్లం. మంచి మార్కులు సాధించేవాళ్లం. అక్క అనుపమ హోంశాఖలో ఉద్యోగం సాధించడం నాలో పట్టుదలను మరింత పెంచింది. బ్యాంక్ ఉద్యోగం సాధించడానికి విపరీతమైన పోటీ ఉన్నా కష్టపడి చదివి ఆంధ్ర బ్యాంక్ పీఓగా ఎంపికయ్యా. ఈ విజయం అమ్మకే అంకితం. – లక్ష్మీప్రియ

సహనంలో అవని

● భర్త మరణానంతరం బతుకు బండిని నడిపిస్తున్న సుజాత
● అవమానాలు ఎదురైనా సడలని సంకల్పంతో ఆటో డ్రైవర్‌గా..


ఆటో నడుపుతున్న సుజాత


బండి సుజాత

కొండపి: కట్టుకున్న భర్త కిడ్నీ జబ్బుతో కాలం చేయడంతో కలత చెందిన ఆమెకు కళ్ల ముందే భవిష్యత్ కనిపించింది. ఇద్దరు పసివాళ్లను ప్రయోజకులను చేయడం కోసం కూలీనాలీ చేసింది. సంపాదన సరిపోకపోవడంతో ఆటో డ్రైవర్ అవతారమెత్తింది. 'ఆడదానివి నువ్వు ఆటో నడుపుతావా..' కొందరు హేళన చేసినా కుటుంబ పోషణ నిమిత్తం సడలని సంకల్పంతో అనుకున్నది సాధించింది. చకా చకా గేర్లు మారుస్తూ కొండపి మండలంలో రోడ్లపై ఆటోను రయ్యిమనిపించింది. ఆటో నడపడానికి వచ్చిన కొత్తలో హేళన చేసిన వారితోనే 'ఆటో రెడ్డమ్మ' అని పిలిపించుకుంది.

జరుగుమల్లి మండలం పీరాపురం గ్రామానికి చెందిన బండి సుజాత ప్రస్తుతం కొండపి మండలం జాళ్లపాలెం గ్రామంలో నివసిస్తున్నారు. 13 సంవత్సరాల క్రితం భర్త బండి మాల కొండయ్య కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మరణించారు. వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. తండ్రి చనిపోయేనాటికి పెద్ద కుమారుడు వీర వెంకటేష్ మూడేళ్లు, చిన్న కుమారుడు బ్రహ్మారెడ్డికి రెండేళ్ల వయసు. ఊహ తెలిసే సమయానికి తండ్రిని కోల్పోయిన పిల్లలకు సుజాత అన్నీ తానైంది. తండ్రి లేని లోటు పిల్లలకు తెలియకుండా చిన్నచిన్న పనులు చేసి కుటుంబాన్ని నెట్టుకొచ్చింది. కూలీ పనులతో వచ్చిన డబ్బు ఇంటి ఖర్చులకు, పిల్లల చదువులకు సరిపోకపోవడంతో ఆటో నడపాలని నిర్ణయించుకుంది. ఆటో కొనేందుకు ఆర్థిక పరిస్థితి సరిపోకపోవడంతో అప్పు చేసింది. గత ఐదేళ్లుగా కొండపి నుంచి జాళ్లపాలెం వరకు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తోంది. జాళ్లపాలెం మార్గంలో ఆటోల సంఖ్య క్రమంగా పెరగడంతో రోజుకు రెండు ట్రిప్పులు తిరగడం కూడా కష్టంగా మారింది. ఓ పక్క అనారోగ్య సమస్యలు బాధిస్తున్నా పిల్లల ఉన్నతికి, కుటుంబం గడవడం కోసం మొక్కవోని ధైర్యంతో ఆటో నడుపుతోంది. ఆర్థిక స్థోమత అంతంతమాత్రమే కావడంతో ఇంటి నిర్మాణం మధ్యలోనే నిలిపివేసింది.'ఆటో నడపడం ప్రారంభించిన కొత్తలో 'ఆడ మనిషి ఏ విధంగా ఆటో నడుపుతుంది' అని కొందరు ప్రయాణికులు ఎక్కేందుకు నిరాకరించారు. ఆ సమయంలో కుటుంబ పోషణ మరింత కష్టమైపోయింది. కొన్నాళ్ల తర్వాత ప్రయాణికుల్లో నమ్మకం కుదిరింది. అప్పటి నుంచి అందరూ ఆటో ఎక్కుతున్నారు' అని పాత రోజులను గుర్తు చేసుకుంది రెడ్డెమ్మ. ఈమె పెద్ద కుమారుడు కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం, రెండో కుమారుడు పెద్ద కండ్లగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. పిల్లలు బాగుండాలన్న తాపత్రయంతోనే తాను ఆటో డ్రైవర్ అవతారం ఎత్తాల్సి వచ్చిందని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సహనం కోల్పోకుండా బతుకు బండిని నెట్టుకొస్తున్నానని చెబుతోంది ఈ ఆటో రెడ్డెమ్మ.

కాడి.. మేడి.. లేడీ..

ప్రకృతి వ్యవసాయంలో రాణిస్తున్న గుళ్లాపల్లి సుజాత
సాటి రైతులకు శిక్షణ ఇస్తూ ముందుకు..


ఎడ్ల అరకను పరిశీలిస్తున్న సుజాత

కొనకనమిట్ల: మొక్కవోని దీక్షతో ప్రకృతి సాగులో రాణిస్తూ వ్యవసాయానికి మహిళలు కూడా వెన్నెముకగా నిలుస్తారని నిరూపిస్తున్నారు ఆదర్శ మహిళా రైతు గుళ్లాపల్లి సుజాత. సమాజంలో లింగ వివక్ష, అసమానతలను నివారించినప్పుడే ప్రగతి సాధ్యమవుతుందనే సంకల్పంతో కాడి, మేడి పట్టిన ఈ లేడీ ప్రస్థానం ఎందరికో స్ఫూర్తిదాయకం. ప్రకృతి వ్యవసాయం చేయాలనే తలంపుతో కొనకనమిట్ల మండలం పెదారికట్ల గ్రామ సమీపంలో రాళ్ల రప్పలున్న 40 ఎకరాల భూమిని కొనుగోలు చేసి బిందు సేద్యంతో నేడు నవధాన్యాలు పండిస్తున్నారు. రసాయనిక అవశేషాలు లేని అన్ని రకాల ఆహార పంటలు పండిస్తున్నారు. అందరూ ఆరోగ్యకరమైన జీవనం సాగించేలా రైతులకు సాగులో మెళకువలు నేర్పిస్తున్నారు. వర్షాలపై ఆధారపడకుండా సోలార్ సిస్టం, డ్రిప్ సౌకర్యంతో నీటి తడులు అందిస్తూ ఏడాది పొడవునా రరకాల పంటలు పండిస్తున్నారు. పొలంలో సేద్యం, పురుగు మందుల పిచికారీ, విత్తనాల సాగును సులభంగా చేసేందుకు మెకానికల్ ఇంజనీర్ అయిన భర్త కోటేశ్వరరావు సహకారంతో మల్టీపర్పస్ రోబోను తయారు చేశారు. తాము పండించిన ఆహార ఉత్పత్తులను 'విశ్వమాత ఫామ్స్' పేరుతో దేశ, విదేశాల్లో మార్కెటింగ్ చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో మేటిగా నిలిచిన సుజాతను ప్రభుత్వం రైతు నేస్తం అవార్డుతో సత్కరించింది. 2021లో సాక్షి ఎక్సలెన్స్ అవార్డు, ముప్పవరపు ఫౌండేషన్ నుంచి ఉత్తమ రైతు అవార్డు, రాష్ట్ర జీవ వైవిధ్య బోర్డు నుంచి బయోడైవర్సిటీ కన్జర్వర్ అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గుంటూరు సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్.శారద, జయలక్ష్మి చేతుల మీదుగా సన్మానం, ప్రసంశ పత్రం అందుకున్నారు.


ఎన్జీ రంగా యూనివర్సిటీ అధికారుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సుజాత దంపతులు

క్లుప్తంగా

10 నుంచి ఒంగోలులో పొగాకు కొనుగోళ్లు

చీమకుర్తి: ఒంగోలు–1 వేలం కేంద్రంలో ఈ నెల 10వ తేదీ పొగాకు కొనుగోళ్లు ప్రారంభమవుతాయని వేలం కేంద్రం నిర్వహణాధికారి రవికాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు–1 వేలం కేంద్రం పరిధిలో 6,943 హెక్టార్లలో పొగాకు సాగుకు అనుమతివ్వగా, 10,802 హెక్టార్లలో రైతులు పంట సాగుచేసినట్లు తెలిపారు. 11.8 మిలియన్ కేజీల కొనుగోలుకు అనుమతివ్వగా, 19.5 మిలియన్ కేజీల పొగాకు సాగుచేసినట్లు అంచనా వేశామన్నారు. సోమవారం వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి పొగాకు బోర్డు ఈడీ ఏ శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. ఆర్‌ఎం ఎం.లక్ష్మణ్‌రావు కూడా పాల్గొంటారని, ఒంగోలు–1 వేలం కేంద్రం పరిధిలోని పొగాకు రైతులు హాజరుకావాలని కోరారు.

10 నుంచి బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

సంతనూతలపాడు: మండలంలోని ఎండ్లూరు డొంక వద్ద గల మహిళా ప్రాంగణంలో ఈ నెల 10వ తేదీ నుంచి బ్యూటీషియన్, జనరల్ డ్యూటీ నర్స్ కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు మహిళా ప్రాంగణ జిల్లా మేనేజర్ వై.అంజమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల్లోపు మహిళలు ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సూజు ఫొటోలతో 10వ తేదీ మహిళా ప్రాంగణ కార్యాలయానికి వచ్చి దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఇతర వివరాలకు 8333921346 మొబైల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విద్యుదాఘాతానికి రైతు మృతి

యర్రగొండపాలెం: విద్యుదాఘాతానికి రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన కె.పిచ్చయ్య (58) తన పొలంలో పనులు చేసుకుంటున్న సమయంలో కిందపడి ఉన్న విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై పి.చౌడయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్రికెట్ బెట్టింగ్‌లో టీడీపీ వర్గీయులపై కేసులు

● నిందితులు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులంటూ వారం రోజులుగా పచ్చపత్రికల దుష్ప్రచారం

ఒంగోలు టాస్క్‌ఫోర్స్: కొద్ది రోజులుగా సింగరాయకొండ మండలంలో చర్చనీయాంశంగా మారిన క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో టీడీపీ వర్గీయులపై కేసులు నమోదయ్యాయి. గురువారం రాత్రి పిగిలి శివ, కేదారి రామకృష్ణ, నక్కా రమేష్, షేక్ నిస్సార్, షేక్ కరిముల్లా, రామారావు, సుబ్బారెడ్డి, ఎం.వెంకట్రావు, షేక్ యస్దాని, మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసి స్టేషన్ బెయిలిచ్చి పంపించారు. కేసులు నమోదైన వారిలో పిగిలి శివ పాతసింగరాయకొండ పంచాయతీకి చెందిన టీడీపీ నాయకుడికి దగ్గర బంధువు. ఈ నాయకుడే క్రికెట్ బెట్టింగ్ ఆడుతూ తన బంధువు శివను కూడా బుకీగా మార్చాడని ఆ పార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు. చుట్టుపక్కల మండలాల్లో కూడా ఇతని నెట్‌వర్క్ ఉందని, ఇటీవల కాలంలో ఇతని పేరుపై కొనుగోలు చేసిన స్థలాలు, మామిడితోటలు, ఇళ్లు ఇందుకు నిదర్శనమని జోరుగా ప్రచారం సాగుతోంది. అంతేగాకుండా గతంలో బెట్టింగుల్లో డబ్బు పోగొట్టుకున్న గుంటూరు జిల్లాకు చెందిన వారు మురళితో పాటు శివపై కూడా ఫిర్యాదు చేశారని, ఆ కేసు గుంటూరు సీసీఎస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉందని సమాచారం. ఈ కేసులో ఉన్న టీడీపీ ముఖ్య నాయకుడు రామకృష్ణ మండల కేంద్రంలో రెస్టారెంట్ నిర్వహిస్తూ ఆ రెస్టారెంట్ కేంద్రంగా క్రికెట్ బెట్టింగులు ఆడిస్తూ మద్యం అమ్మకాలు సాగిస్తున్నాడని సమాచారం. అయితే, టీడీపీ వారు కొద్దిరోజులుగా ఈ కేసును పక్కదారి పట్టించేందుకు పచ్చపత్రికల్లో వైఎస్సార్ సీపీకి చెందినవారే బెట్టింగులకు పాల్పడుతున్నారంటూ దుష్ప్రచారం చేశారు. శానంపూడిలో ఎంఎల్‌హెచ్‌పీగా పనిచేస్తున్న వ్యక్తి రైలు కిందపడి చనిపోయిన ఘటన, పాకలకు చెందిన యువకుడు రైలు పట్టాల కిందపడి చనిపోయిన ఘటన, వ్యవసాయశాఖలో పనిచేసే అధికారి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని చనిపోయిన ఘటనకు టీడీపీ మద్దతుదారులైన బుకీలే కారణమని తెలుస్తోంది. ఇటీవల బాలయోగినగర్‌కు చెందిన యువకుడు పందెంలో రూ.4 లక్షలు గెలుచుకున్నాడు. కానీ, అతనికి బుకీలు రూ.లక్ష మాత్రమే ఇచ్చి మళ్లీ అతనిచేత బెట్టింగు ఆడించి ఆ రూ.3 లక్షలు స్వాహా చేశారని, అలాగే కలికవాయకు చెందిన యువకుడు సుమారు రూ.50 లక్షల వరకు బెట్టింగులో పోగొట్టుకున్నాడని సమాచారం. ఈ బెట్టింగ్ వ్యవహారం జరుగుమల్లి మండలం పైడిపాడు గ్రామానికి చెందినది కాగా, తీగ లాగితే డొంక కదిలినట్లు మండలంలో బెట్టింగ్ వ్యవహారం మొత్తం బయటపడింది. క్రికెట్ బుకీలు గురువారం రాత్రి స్టేషన్ బెయిల్ తీసుకుని వచ్చిన తర్వాత వారి అడ్డా అయిన కందుకూరు ఫ్లెటైవర్ సెంటర్‌లో సమావేశమైనట్లు తెలిసింది.

మహిళా పోలీసులు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

● ఎస్పీ ఏఆర్ దామోదర్


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: విధి నిర్వహణలో నిత్యం మానసిక ఒత్తిడికి గురయ్యే మహిళా పోలీసులు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రతలు తీసుకోవాలని, ఆరోగ్య రక్షణకు తగినంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక పోలీసు కళ్యాణ మండపంలో మహిళా సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డీపీఓ మహిళా సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పాల్గొని మాట్లాడుతూ మహిళా సిబ్బందికి ఏదైనా ఆరోగ్య సమస్యలుంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. నిత్యం వ్యాయామం, యోగా చేయాలని, మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని సూచించారు. మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటూ నిర్దేశిత లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఆర్ఐ సీతారామరెడ్డి, పోలీసు యూనిట్ డాక్టర్ భానుమతి, వైద్యులు థేరాజ్, లావణ్య, శ్యామసుందరి, శిల్ప, ప్రియాంక, జహంగిర్, ఆనంద్ యాదవ్, హైందవి, ప్రియదర్శిని, కిరణ్ కుమార్‌రెడ్డి, రామాంజనేయులు, ప్రవీణ్, శుభశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మాయలో వైన్‌షాపు యజమాని

● రూ.95 వేలు పోగొట్టుకుని 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు

సింగరాయకొండ: 'హలో గోవిందరావు..నేను ఏఎస్సై ప్రభాకర్‌ని..ఎక్కడున్నావు'..? ఇవతలి నుంచి గోవిందరావు..సార్ నేను షాపులో ఉన్నాను సార్'. అవతలి నుంచి..సరేగానీ..నాకు అర్జంటుగా రూ.95 వేలు ఫోన్ పే చెయ్యి..నేను ఆ మొత్తాన్ని కానిస్టేబుల్‌తో పంపిస్తున్నా.. సింగరాయకొండ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద గల రమ్య వైన్ షాపులో పని చేస్తున్న గోవిందరావుకు 9010699759 సెల్ నంబర్ నుంచి శుక్రవారం సాయంత్రం ఫోన్ వచ్చింది. దీంతో గోవిందరావు మాట్లాడుతూ ఈ విషయం మా సార్‌కు కూడా చెప్పండి సార్ అంటూ షాపు పర్యవేక్షణ చేసే ఉప్పాళ్ల రమేష్‌కు ఫోన్ చేసి చెప్పాలని సూచించారు. ఆ తర్వాత ఏఎస్సై ప్రభాకర్ అని చెప్పుకున్న వ్యక్తి రమేష్‌కు కూడా ఫోన్ చేసి ఏం చెప్పాడో ఏమోగానీ.. ఆయన వెంటనే అతనికి రూ.95 వేలు ఫోన్ పే చేశాడు. కానిస్టేబుల్ డబ్బు తెస్తాడు.. తీసుకో అని గోవిందరావుకు కూడా ఫోన్ చేసి చెప్పాడు. తీరా చూస్తే పోలీస్‌స్టేషన్‌లో ప్రభాకర్ అనే పేరుతో ఏఎస్సై ఎవరూ లేరని, తాము సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డామని తెలుసుకుని హుటాహుటిన పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన మోసాన్ని పోలీసులకు తెలిపారు. వారి సూచన మేరకు వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి సమాచారం అందించారు. పోలీసుల పేరుతో వైన్ షాపు యజమానిని నమ్మకంగా మోసం చేసిన ఈ విషయం గురించి తెలుసుకుని మండల ప్రజలు ఉలిక్కిపడ్డారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఒంగోలు టౌన్: రైలుకింద పడి ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారెడ్డి పాలెం, టంగుటూరు రైల్వే స్టేషన్ల మధ్య శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని ఒక వ్యక్తి రప్తీసాగర్ ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్య చేసుకొని మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయసు 35 ఏళ్లు ఉంటుందని, కుడి చేతి మీద అమ్మ అని, ఎడమ ఛాతీ మీద ఈశ్వరి అని పచ్చబొట్టు ఉంది. జీఆర్పీ ఎస్సై అరుణ కుమారి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. మృతుడు తిరుపతి, టంగుటూరు ప్రాంతాలకు చెందిన వ్యక్తి గా పోలీసులు భావిస్తున్నారు.

చిరుత మృతి కేసులో ఇద్దరు ఫారెస్ట్ ఉద్యోగుల సస్పెన్షన్

యర్రగొండపాలెం: చిరుత పులి మృతిచెందిన సంఘటనపై నమోదైన కేసులో ఇద్దరు అటవీశాఖ ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ మార్కాపురం టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ జి.సందీప్‌కృపాకర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 16వ తేదీ యర్రగొండపాలెం రేంజ్ పరిధిలోని కొలుకుల బీట్‌లో అటవీ జంతువుల కోసం వేసిన ఉచ్చులో చిరుత పులి చిక్కుకుంది. అటవీ శాఖాధికారులు సకాలంలో స్పందించకపోవడం వలన అది మృతి చెందింది. దీనిపై నమోదైన కేసులో ఇటీవల నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. అటవీ ప్రాంతంలో సంచరించే వేటగాళ్లను గుర్తించలేకపోవడం, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన ఉచ్చులో చిరుత చిక్కుకుని మరణించినట్లు గుర్తించిన ఫారెస్ట్ శాఖ ఉన్నతాధికారులు కొలుకుల సెక్షన్ ఆఫీసర్ బి.నక్రూనాయక్, బీట్ ఆఫీసర్ టి.నాగేశ్వరరావును సస్పెండ్ చేశారు.